క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి గ్రామోత్సవం

రెంటచింతల: అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని అయప్పస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో రెంటచింతల గ్రామ పురవీధులలో అయ్యప్పస్వామి ఉత్సవమూర్తులతో మంగళవారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. మాచర్లకు చెందిన సైదులు నేతృత్వంలో రెంటచింతలకు చెందిన మహిళలు నిర్వహించిన కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. రాత్రి 8 గంటల నుంచి 11 గం. వరకు అయప్పస్వామివారి ఊరేగింపు వైభవంగా కొనసాగింది. అర్చకుడు వెల్లటూరి నాగేశ్వరశర్మ, గుంటక కాశిరెడ్డి, కె.సైదులు, గుండా రాము, వెన్నా వెంకటేశ్వరరెడ్డి తదితరులున్నారు.

వృద్ధులకు అన్నదానం



గురజాల: స్థానిక పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో మంగళవారం స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామానికి చెందిన శివతేజ లైటింగ్ అండ్ డెకరేషన్ నిర్వాహకుడు అంబిరాజు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మైల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీవిశ్వనాథం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో కటికల నాగేశ్వరరావు, బండి రవికుమార్, కనకం హనుమంతరావు తదితరులున్నారు.

ఈ–కేవైసీ పూర్తి చేయాలి

ముప్పాళ్ళ: మండలంలోని గ్రామాల్లో ఈ-కేవైసీ నమోదు కాని రేషన్ కార్డుదారులు ఈ నెలాఖరులోపు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో చెప్పారు. మండలంలో మొత్తం 37,389 రేషన్ కార్డులకు గాను ఇంకా 222 కార్డుదారుల ఈ–కేవైసీ నమోదు పెండింగ్ ఉందన్నారు. గడువులోపు నమోదు కాకుంటే రేషన్ నిలిచిపోతుందన్నారు. కార్డులోని కుటుంబ సభ్యులందరూ ఈ-కేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

పెదకూరపాడు : పెదకూరపాడులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో కాటూరు మెడికల్ ఆసుపత్రి ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సోమయాజులు మంగళవారం తెలిపారు. వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ, ఆప్తమాలజీ, డెర్మటాలజీ తదితర వ్యాధులకు సంబంధించి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. వైద్య శిబిరంలో పాల్గొనే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తీసుకొని రావాలని కోరారు.

18న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల



శావల్యాపురం: మండలంలోని గంటావారి పాలెం గ్రామం గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి వెంబడి వేంచేసి యున్న శ్రీప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల వేడుకలు ఈనెల 18వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. తిరునాళ్ల వేడుకలు సందర్భంగా గ్రామస్తులు రెండు విద్యుత్ ప్రభలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు రాత్రి పూట ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు శాంతి భద్రతలతో పాటు ట్రాఫిక్ అంతరాయం వాటిల్లకుండా తిరునాళ్ల జరిగే ఏరియాను పరిశీలించారు.

తిరునాళ్లను విజయవంతం చేయాలి

వినుకొండ: మండలంలోని మదమంచిపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి తిరునాళ్ల మహోత్సవ ఏర్పాట్లపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా భారీ సంఖ్యలో తిరునాళ్లకు ప్రజలకు తరలివస్తారని, అన్ని శాఖల వారు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్, హెల్త్, ఫైర్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి సాయం చేయాలి

వినుకొండ : ప్రతి విద్యార్థి నిజాయితీ క్రమశిక్షణతో ఆపదలో ఉన్నవారికి సాయం చేయడానికి ముందుకు రావాలని పాఠశాల హెచ్‌ఎం పి.హవీలా తెలిపారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో భారత స్కౌట్ అండ్ గైడ్స్ ట్రూప్ యూనిట్‌కు ఎంపికైన 26 మందికి యూనిఫాంను అందజేశారు. ఈ సందర్భంగా స్కౌట్ విధి విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ పీడీ ఉదయరాజు, టీచర్లు డి.జ్యోతి, ఎ.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జానపాడు బ్రిడ్జిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

- మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషి వల్లే రైల్వే బ్రిడ్జి మంజూరు
- కూటమి నేతల అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరు
- వైఎస్సార్ సీపీ నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు వీరభద్రుని రామిరెడ్డి, జూలకంటి శ్రీనివాసరావు తదితరులు

పిడుగురాళ్ల: జానపాడు రోడ్డులోని రైల్వే బ్రిడ్జి నిర్మాణం ఎవరి హయాంలో మంజూరైందో బహిరంగ చర్చకు సిద్ధమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వీరభద్రుని రామిరెడ్డి, జేసీ పిడుగురాళ్ల మున్సిపాలిటీ ఇన్‌చార్జి జూలకంటి శ్రీనివాసరావులు పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఈమేరకు వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరైన రైల్వే బ్రిడ్జిని నిర్మాణం ప్రారంభిస్తే, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే కాసుమహేష్‌రెడ్డికి పేరు వస్తుందనే దురుద్దేశంతో 10 నెలలు కావస్తున్నా కూటమి నేతలు పనులు చేపట్టటం లేదని వారు విమర్శించారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి..

2022లో అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబును 10, 15 సార్లు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కలిసి బ్రిడ్జిని మంజూరు చేయించారని వారు పేర్కొన్నారు. కరోనా సమయం కావటంతో కొంత ఆలస్యమైనా.. స్థానిక ప్రజలు, వ్యాపారుల వెతలు తీర్చే ఉద్దేశంతో బ్రిడ్జి నిర్మాణానికి కావాల్సిన రాష్ట్ర, కేంద్ర అనుమతులను కాసు పట్టుబట్టి సాధించారన్నారు. అనుమతులు వచ్చిన తర్వాత, రోడ్డు విస్తరణ పనులు, విద్యుత్ స్తంభాల తొలగింపు వంటి కార్యక్రమాలు చేపట్టే ఉద్దేశంతో వెంటనే శంకుస్థాపన చేశారన్నారు. ఈ విషయం పిడుగురాళ్ల పట్టణవాసులకందరికీ తెలుసని.. టీడీపీ నేతల అసత్య ప్రచారాలను వారు నమ్మరన్నారు. ఇప్పటికైనా కూటమి నేతలు ఈ బ్రిడ్జి విషయమైన సత్యాలు తెలుసుకుని, అసత్యాలు ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ విషయమై తాము బహిరంగ చర్చకు సిద్ధమని వారు తెలియజేశారు. బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలని, లేని పక్షంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు పేర్కొన్నారు. ఇన్‌ఛార్జి ఎంపీపీ సాలుతూరి బాబు, పార్టీ జానపాడు గ్రామ అధ్యక్షుడు సాంబశివరావు, వైఎస్సార్ సీపీ యూత్ జిల్లా జనరల్ సెక్రటరీ బుల్లెట్ మణి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాతులూరి రమేష్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు మస్తాన్ వలి, పార్టీ జానపాడు నాయకులు ఆదాం, అబ్దుల్ బుడే, అబ్దుల్లా, సాల్మన్, రసూల్, షేక్ జమాల్, పట్టణ యూత్ అధ్యక్షుడు మందా సుధీర్, కౌన్సిలర్ మాదాల కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రీన్ మాచర్ల' ఏర్పాటుకు కృషి



డివైడర్ పై గ్రాస్ మ్యాట్ ఏర్పాటును పరిశీలిస్తున్న కమిషనర్ డి.వేణుబాబు

మాచర్ల రూరల్: పట్టణాన్ని గ్రీన్ మాచర్లగా రూపొందించేందుకు రింగు రోడ్డు నుంచి పార్క్ సెంటర్ వరకు ఉన్న డివైడర్ల పై గ్రాస్ మ్యాట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. మంగళవారం డివైడర్ల పై ఏర్పాటు చేస్తున్న గ్రాస్ మ్యాట్లను పరిశీలించి ఆయన మాట్లాడారు. స్థానిక కేసీపీ సంస్థ సహకారంతో డివైడర్లపై గడ్డి మ్యాట్లను ఏర్పాటు చేస్తున్నామని, పూల మొక్కలను నాటి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు తాము పనిచేస్తున్నట్లు తెలిపారు. గతంలో వేసిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో గ్రీనరీ ఏర్పాటుకు మున్సిపల్ చైర్మన్ పోలూరి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. డివైడర్ల పై ఎటువంటి పోస్టర్లను అంటించరాదని, అలా అంటించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కేసీపీ వెల్ఫేర్ ఆఫీసర్, కార్మికులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నివేశన స్థలాలు కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగుల సంఘ నాయకులు

మాచర్ల రూరల్: పట్టణంలో ఎన్నో ఏళ్ల నుంచి నివాసముంటున్న దివ్యాంగులకు రవాణా సౌకర్యం కలిగిన ప్రాంతాల్లో నివేశన స్థలాలు కేటాయించాలని అబ్దుల్ కలాం సేవా సమితి, వికలాంగుల సేవా సమితి నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. మానసికంగా, శారీరకంగా దివ్యాంగులుగా ఉన్న వారికి నివేశన స్థలాల ఏర్పాటులో ప్రత్యేక దృష్టి సారించాలని, గుంటూరు రోడ్డులోని చెన్నకేశవ స్వామి మాన్యం, మండాది, సాగర్ ప్రధాన రహదారి ప్రాంతంలో స్థలాన్ని మంజూరు చేసి నివాస గృహాల ఏర్పాటులో తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బి.కిరణ్ కుమార్‌ను కోరారు. అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షుడు షేక్ పాషా వలి, వికలాంగుల సేవా సమితి అధ్యక్షుడు షేక్ అన్వర్ బాషా, పి.అంజిబాబు, శంకర్, నాగేశ్వరరావు, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారానికి రీసర్వే దోహదం



భూ రీసర్వే పై రైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ కిరణ్ కుమార్, అధికారులు

మాచర్ల రూరల్: భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించేందుకు భూ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందని తహసీల్దార్ బి.కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి మండలంలోని రాయవరం గ్రామంలో భూ సర్వే పై రైతులతో అవగాహన కల్పించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న రీ సర్వే రైతులకు ఎంతో ఉపయోగకరమని, ఎన్నో సంవత్సరాల నుంచి పరిష్కారం కాని భూముల సరిహద్దు వివాదాలు, మార్పులు చేర్పులు చేసేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రైతులు రీ సర్వే పై అపోహలు పెట్టుకోవద్దన్నారు. ఆర్ఐ అనిల్ కుమార్, సర్వేయర్ ఆదినారాయణ, వీఆర్ఓలు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యంతో అగ్ని ప్రమాదాల నియంత్రణ సాధ్యం

అగ్నిమాపక అధికారి సుబ్బారావు



ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: ప్రజలను చైతన్యవంతులను చేయడం ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించడం సాధ్యమని సత్తెనపల్లి అగ్నిమాపక అధికారి ఎంవీ సుబ్బారావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, తాలూకా సెంటర్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో మంగళవారం వారోత్సవాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కరపత్రాలను ముఖ్యమైన ప్రాంతాల్లో అంటించి అగ్నిమాపక వారోత్సవాల గురించి వివరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి సుబ్బారావు మాట్లాడుతూ ఎక్కువగా అగ్ని ప్రమాదాలు అజాగ్రత్త వల్లే సంభవిస్తాయని, అగ్ని ప్రమాదాలపై ప్రజలకు కనీస అవగాహన కల్పిస్తే చాలా వరకు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు అన్ని వర్గాల ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ లీడింగ్ ఫైర్ మాన్ ఆలా శ్రీనివాసరావు, డ్రైవర్ ఆపరేటర్ సీహెచ్ సాగర్ బాబు, ఫైర్ మాన్‌లు ఎం.మోహన్ బాబు, బి.నాగేశ్వరరావు, ఎస్‌కే బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి

మండల ఆయుర్వేద వైద్యుడు ఆర్.శ్రీనివాస్



ఆయుర్వేద మందులను పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్

బెల్లంకొండ: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవడం ద్వారా పోషకాహార లోపాన్ని నివారించవచ్చని మండల ఆయుర్వేద వైద్యులు ఆర్.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని టీసీ అంగన్‌వాడీ కేంద్రంలో 'పోషణ్ పక్వాడా' పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహించారు. బాలింతలు, గర్భిణులు తృణ ధాన్యాలు, ఆకుకూరలు, సీజన్లో దొరికే పండ్లు ఆహారంగా తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే బాలామృతాన్ని క్రమం తప్పకుండా తినాలని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న బాలింతలు, గర్భిణులు వేసవిలో జాగ్రత్తలు పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం వడదెబ్బ నివారణ, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరిమళ, అంగన్‌వాడీ కార్యకర్త ఆయేషా, యోగా టీచర్ కోటేశ్వరమ్మ, వెంకటరామయ్య పాల్గొన్నారు.

సీసీ కెమెరాల దొంగతనం అవాస్తవం

రొంపిచర్ల: మండలంలోని మర్రిచెట్టుపాలెం గ్రామంలో గల శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో సీసీ కెమెరా, మానిటర్‌లు చోరీకి గురయ్యాయని సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ మేరకు చోరీకి సంబంధించిన వీడియో కూడా వైరల్ అయ్యింది. దీనిపై పోలీస్ స్టేషన్‌లో వివరణ కోరగా సోషల్ మీడియాలో వచ్చిన సమాచారం అవాస్తవం అన్నారు. ఆలయంలోని సీసీ కెమెరా, మానిటర్‌లు మెకానిక్‌లు మరమ్మతుల నిమిత్తం తీసుకువెళ్లారన్నారు. ఆలయంలో ఎలాంటి చోరీ జరగలేదని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, మండలంలోని బోయపాలెం గ్రామానికి చెందిన షేక్ అల్లాభక్షు (40) ఈ నెల 8న వ్యక్తిగత పనుల కోసం ద్విచక్ర వాహనంపై చేబ్రోలు వెళ్లి తిరిగి వస్తుండగా, చేబ్రోలు–నారాకోడూరు మార్గంలో గుర్తు తెలియని వాహనం అతన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ, శనివారం (12వ తేదీ) అల్లాబక్ష మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రైల్వేస్టేషన్‌లో చలివేంద్రం ప్రారంభం



నరసరావుపేట: వేసవిని పురస్కరించుకొని రైల్వేస్టేషన్ ప్రాంగణంలో 1983 పదోతరగతి పూర్వ విద్యార్థులు ఏర్పాటుచేసిన మంచినీటి చలివేంద్రాన్ని మంగళవారం గుంటూరు రైల్వే స్టేషన్ ఏవో ఎం.ముఖేష్‌సింగ్ ప్రారంభించారు. రైల్వేస్టేషన్‌కు రాకపోకలుసాగించే ప్రయాణీకులతో పాటు పట్టణ ప్రజలకు చలివేంద్రం ప్రయోజనకరంగా ఉంటుందని పూర్వ విద్యార్థి అయిన స్థానిక రైల్వేస్టేషన్ సూపరిండెంట్ షేక్ బాజాన్ అన్నారు. పూర్వ విద్యార్థులు పొట్టి ఆంజనేయులు, బీఎస్ రామకృష్ణ, కె.అంజిరెడ్డి, షేక్ సుభాని, శాస్త్రి, గఫార్, శంకర్ పాల్గొన్నారు.

వినుకొండలో పేదలకు అన్నదానం



వినుకొండ: చర్చ్ ఆఫ్ క్రైస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలోని పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈవో ఎండీ రాజు చేతుల మీదుగా అన్నం పొట్లాలను అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు ఎం.రమేష్‌బాబు, ఎం.ప్రవళిక, ఎన్.బ్రహ్మయ్య, వెంకటకృష్ణ, శ్రీను, వీరాంజి, ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

మనమిత్ర వాట్సాప్ సేవలను సద్వినియోగం చేసుకోండి

శావల్యాపురం: మన మిత్ర వాట్సప్ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రం శావల్యాపురం బీసీ కాలనీలో పర్యటించి ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన వాట్సప్ సేవల గురించి కాలనీవాసులకు కర పత్రాల అందజేసి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మన మిత్ర వాట్సప్ యాప్ ద్వారా ఈ–ధ్రువీకరణ పత్రాలు రశీదులు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చునన్నారు. చెల్లింపులు భద్రతతో కూడిన ఒక పేమెంటు లింకు తెలుసుకోవచ్చునన్నారు. సర్వీసు విధానంపై గురించి లబ్ధిదారులు తెలుసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మనమిత్ర (వాట్సప్ గవర్నెన్స్) సెల్ నంబరు 9552300009 సంప్రదించి ప్రభుత్వం అందించే సేవలు గురించి తెలుసుకోవచ్చున్నారు. ఆయనతో పాటు మహిళా పోలీసు గౌసియాబేగం, ఇంజనీరింగ్ సహాయకులు రంతు లక్ష్మణ్, వీపీఏ వెంకయమ్మ తదితరులు ఉన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన అవసరం



సినిమా హాల్ వద్ద సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పిడుగురాళ్ల: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి కె. శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద, సినిమాహాల్‌లో ప్రజలు, సిబ్బందికి మంగళవారం అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు మనకు తెలియకుండానే జరిగిపోతుంటాయని, కానీ జరిగిన వెంటనే కంగారు పడకుండా దానిని కొంతమేరకు అదుపు చేసే చిట్కాలు తెలిసి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ప్రయాణికులు, అధిక జనాభా ఉన్న ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై వారికి అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు చేయాల్సిన ప్రాథమిక పనులను ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అగ్నిమాపక సిబ్బంది పీవీ రమణ, జె.మణికంఠ, పీవీ దాసు, ఇ.ధర్మానాయక్, వి.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ఎంతో మేలు

మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల: పంటలను సాగుచేసే ముందు భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని దీంతో వారికి ఆ భూములలో సూక్ష్మ పోషకాలపై అవగాహన ఉంటుందని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రెంటచింతల, మిట్టగుడిపాడు గ్రామాలలోని పంటపొలాల్లో రైతులను ఉద్దేశించి మాట్లాడారు. సూక్ష్మ పోషకాల లోపాలు ఉన్నట్లయితే పంటల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని హెచ్చరించారు. ఇనుము, మాంగనీసు, బోరాన్, కాపర్, జింక్, మెగ్నీషీయం, క్లోరిన్, గంధకం అనే సూక్ష్మపోషకాలు, భూమిలో సమపాళ్లలో ఉండేలా చూసుకోవడానికి భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకుని ఎరువులు వాడుకోవాలన్నారు. జీవన ఎరువుల వాడకం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. సూక్ష్మ పోషకాల లోపాల వలన వచ్చే తెగుళ్లను నివారించేందుకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని ఎక్కువ శాతం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచినట్లయితే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. వీహెచ్‌ఏలు గొంటు కృష్ణారెడ్డి, పవన్ కిశోర్, రైతులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం ద్వారా రూ. 4.03 లక్షల ఆదాయం



బహిరంగ వేలంలో పాల్గొన్న ఈఓ రామిరెడ్డి, రైతులు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని వేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందిన 37.61 ఎకరాల భూములకు స్థానిక శివాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన కౌలు బహిరంగ వేలం ద్వారా రూ. 4.03 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ గాదె రామిరెడ్డి తెలిపారు. 8 ఎకరాల మెట్ట భూమిని చింతా రామకృష్ణ రూ. 80 వేలకు, 6.73 ఎకరాల మెట్ట భూమిని సన్నెగంటి సిద్ధయ్య రూ. 92 వేలకు, 8.88 ఎకరాల మాగాణి భూమిని తిప్పాబత్తుల వెంకట సుబ్బయ్య రూ. 94 వేలకు, 14 ఎకరాల మాగాణి భూమిని నెవలి పెద్ద నాగిరెడ్డి రూ. 1.37 లక్షలకు బహిరంగ వేలంలో భూములు దక్కించుకున్నట్లు తెలిపారు. గత ఏడాది ఈ భూముల ద్వారా రూ. 1.58 లక్షలు ఆదాయం రాగా, ఈ ఏడాది రూ. 4.03 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. దీంతో గత ఏడాది కన్నా ఈ ఏడాది దేవస్థానానికి రూ. 2.45 లక్షలు ఆదాయం అదనంగా వచ్చిందన్నారు. కౌలుకు పాడుకున్న వారికి 2025-26 నుంచి 2027-28 వరకు 3సం.లపాటు కౌలు హక్కును పొందటం జరుగుతుందన్నారు. కౌలు హక్కు పొందిన వారు ముందుగానే ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలాఖరులో నగదు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శివాలయం అధ్యక్షుడు పల్లెర్ల లక్ష్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వివేకానంద ఆశ్రమ సేవలు అభినందనీయం



వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్ పోలూరి నరసింహారావు, మెట్టు గోవిందరెడ్డి

మాచర్ల రూరల్: రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి, స్వామి వివేకానంద సేవా ఆశ్రమంలో ఉచిత కంప్యూటర్ శిక్షణా తరగతులను ఏర్పాటు చేయటం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని స్వామి వివేకానంద సేవా ఆశ్రమంలో ఉచిత కంప్యూటర్ శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో స్వామి వివేకానంద సేవా సమితి ఏర్పాటు చేసి ఉచిత పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ, స్పోకెన్ ఇంగ్లిష్ వంటివే కాకుండా, వేసవి సెలవుల్లో కంప్యూటర్ శిక్షణ ఏర్పాటు చేసిన గోవిందరెడ్డి అభినందనీయుడన్నారు. నేటి సాంకేతిక రంగంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమని, ఇలాంటి శిక్షణను ఉపయోగించుకొని ముందుకు సాగాలని ఆయన కోరారు. కంప్యూటర్ అధ్యాపకులు భారతి, అధ్యక్షులు గోవిందరెడ్డి, టీచర్లు సుచిత, గాయత్రి, భాస్కర్ తదితరులున్నారు.

•నిర్లక్ష్యం వెలుగుతోంది!



ప్రధాన రహదారిలో వెలుగుతున్న విద్యుత్ దీపాలు

పట్టపగలు.. ప్రధాన రహదారి వెంట విద్యుత్ దీపాలు వెలుగుతూ కనిపిస్తుండడంపై ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ఎక్కడో ఒక మారుమూల బజారులో పగలు లైటు వెలిగితే సిబ్బంది పొరపాటు అనుకోవచ్చు, కానీ ఏకంగా ప్రధాన రహదారి వెంట పట్టపగలు విద్యుత్ దీపాలన్నీ వెలుగుతూ ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా కనిపిస్తోంది.

\- పిడుగురాళ్ల

భావితరాలకు స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

జిల్లా రెవెన్యూ అధికారి ఇ.మురళి



అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా అధికారులు

రాజుపాలెం: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారి ఈ మురళి అన్నారు. మండలంలోని మొక్కపాడు గ్రామం ఎస్సీ కాలనీలోని లూథరన్ చర్చి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారి ఈ మురళి, జిల్లా ఇరిగేషన్ అధికారి సీహెచ్ ఆంజనేయులు, గుంటూరు జిల్లా నోడల్ అధికారి కొండా సంజీవరావు, రిటైర్డ్ డీఎస్పీ రవికుమార్‌లు సోమవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలు, స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో అంబేడ్కర్ యూత్ సభ్యులు కాలనీలో పది అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విగ్రహదాత కలేకూరి వెంకటప్పయ్యను అభినందించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ ప్రెసిడెంట్ కలేకూరి యోగినాథ్, సర్పంచ్ కణదం శ్రీను, ఎంపీటీసీ ఎస్‌కే హుస్సేన్, యూత్ సభ్యులు కలేకూరి దాసు, కలేకూరి పెద్ద జోసఫ్, కలేకూరి చిన్న జోసఫ్, నేలటూరి నరసింహారావు, నేలటూరి భాగ్యరాజు, కలేకూరి సాగర్, కాలనీవాసులు పాల్గొన్నారు.